# చేకూరపాడు గ్రామం లోని శ్రీ వేణుగోపాల స్వామి ఓరియంటల్ హై స్కూల్ వజ్రోత్సవం సందర్భంగా

## పాఠాశాల స్థాపన : 1962 వ సంవత్సరం

కొమ్మినేని సత్యనారాయణ సన్ అఫ్ అప్పయ్య 1967 - 68 ఎస్ ఎస్ ఎల్ సి ప్రధమ బ్యాచ్ - చేకూరపాడు.

ఆనాటి మధుర జ్ఞాపకాలు, అనుభవాలు, పాఠశాల కార్యక్రమాల స్ఫూర్తి వలన నేను ఎంచుకున్న కార్యక్రమాలు, తదితర విషయాలను క్లుప్తంగా వివరించదలచాను.

**<u>పాఠశాల స్థాపన:</u>**

1962 వ సంవత్సరంలో కుగ్రామమైన మన చేకూరపాడులో **"శ్రీ వేణు గోపాలస్వామి సంస్కృత ఉన్నత పాఠశాల"** పేరుతో స్థాపించడం జరిగినది. పాఠశాల స్థాపనకు గౌరవనీయులు కీర్తిశేషులు శిరిగిరి పేరయ్య గారు కర్త, కర్మ, క్రియ అంత తానై, గ్రామ ప్రజల సహకారంతో కృషి సల్పియున్నారు. పాఠశాల తరగతులు మొదట ఆనాటి గ్రామ సర్పంచి గౌరవనీయులు కీర్తిశేషులు శిరిగిరి రాఘవులుగారి సావడిలో జరిగేవి. ప్రధమ ఉపాధ్యాయుడుగా గౌరవనీయులు శ్రీ వెల్ది వెంకటేశ్వర్లుగారు నియామకం జరిగి, తరగతులు నిర్వహించేవారు. 1962 సంవత్సరంలో పాఠశాల భవన నిర్మాణం జరిగి సెప్టెంబర్ 7 వ తేదీన ఆనాటి బ్రాడ్ కాస్టింగ్ మినిస్టర్ డా || బెజవాడ గోపాల్రెడ్డిగారిచే వైభవంగా ప్రారంభించబడినది.

ప్రధానోపాధ్యాయులుగా కీర్తిశేషులు మట్టా రామయ్య గారు, ఉపాధ్యాయులుగా కీర్తిశేషులు గడ్డిపాటి సుబ్బా రావు గారు, కీర్తిశేషులు బాచిన నరసింహ రావు గారు, కీర్తి శేషులు ముప్పరాజు సుబ్బారావు గారు, సంస్కృత ఉపాధ్యాయులుగా కీ శే కాండూరి వెంకటరమణాచారి గారు, శ్రీ ఏ ఎన్ శేషాద్రి గారు, శ్రీ రుక్మాంగద (నెల్లూరు) గారు విధులను నిర్వర్తించారు. చుట్టుప్రక్కల గ్రామాలైన మద్దిరాలపడి, చదలవాడ, ఇనమనమెళ్ళూరు, త్రోవగుంట, ముక్తినూతలపాడు, గుడిమెళ్ళపాడు, వలేటివారి పాలెం, కరవాది తదితర గ్రామాల నుండి విద్యార్థులు వచ్చేవారు.

**విద్యాబోధన:**

మన పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులకు వైద్య భోదనతో పాటు ఓర్పు, సహనం, పెద్దలపట్ల గౌరవ భావం, స్నేహ భావం మున్నగు క్రమశిక్షణ విషయాలను బోధించేవారు. సబ్జెక్టుల వారీగా పోటీ పరీక్షలు, ప్రతి వరం డిబేట్ కార్యక్రమాలు, వ్యాస రచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించేవారు. అందువలన విద్యార్థులలో పోటీతత్త్వం ఏర్పడేది. తరగతుల నిర్వహణ అనంతరం ఉపాధ్యాయులు విద్యార్థులు స్నేహ భావంగా మెలిగేవారు.

మన పాఠశాలలో సంస్కృతం ప్రధాన సబ్జెక్టుగా ఉండేది. రఘువంశం, కుమారసంభవం, కౌముది, శాకుంతలం ఇలా ఎన్నో పుస్తక పఠనాలు ఉండి కఠినతరంగా ఉండేది. 1967 - 68 సం || ఎస్ ఎస్ ఎల్ సి ప్రధమ బ్యాచ్ లో 19 మంది పరీక్షలు వ్రాయగా కొన్ని అనివార్య కారణముల వలన దురదృష్టవశాత్తు 5 గురమే పాసైనాము. పాసైన వారిలో నేను , శిరిగిరి శింగయ్య, దేవబత్తిన శింగమ్మ, వేముల వెంకాయమ్మ, నెప్పల హరిబాబు ఉన్నాము.

**తోటపని, పరిసరాల శుభ్రత:**

ప్రతిదినం తరగతుల నిర్వహణ అనంతరం, పరిసరాలను శుభ్రం చేసి పాఠశాల ఆవరణ లో తోటపని చేసే వాళ్ళం. ఆకుకూరలు, కాయగూరలు పండించి వేలం పాటద్వారా ఉపాధ్యాయులు కొనుగోలు చేసి, ఆ డబ్బును విద్యార్థులకిచ్చే బహుమతులకు ఖర్చుచేసేవారు. ఇదే స్పూర్తితో నేను ఈ రోజుకూడా మిద్దెతోటలో ఆకుకూరలు, కూరగాయలు పండిస్తున్నాను.

**క్రీడా విశేషాలు:**

మనపాఠశాలలో ప్రతిదినం లాస్ట్ పీరియడ్ క్రీడా పీరియడ్ గా ఉండేది. బాల్ బ్యాట్మింటన్, కబడ్డీ, ఖో ఖో, బేస్ బాల్ మున్నగు క్రీడలు ఆడుతుండేవాళ్ళం. ఆటలపోటీలు నిర్వహించబడేవి. విజేతలకు బహుమతులు అందజేసేవారు. జిల్లా పరిషత్ పోటీలలో పాల్గొని ప్రజాదరణ పొందేవాళ్ళం. తరగతుల నిర్వహణ అనంతరం ఉపాధ్యాయులు, విద్యార్థులు స్నేహపూర్వకంగా పాఠశాల ఆవరణలో బాల్ బ్యాట్మింటన్ ఆడేవాళ్ళం, అందువలన ఉపాధ్యాయులకు, విద్యార్థులకు స్నేహభావం ఏర్పడేది.

**<u>నటనాశిక్షణ:</u>**

పాఠశాలలో విద్యార్థులకు శిక్షణఇచ్చి, ప్రతి సంవత్సరము వార్షికోత్సవాలలో నాటికల ప్రదర్శన ఏర్పాట్లు చేసి, ఉత్తమ నాటికకు, ఉత్తమ నటులకు బహుమతులు అందజేసేవారు. అదే స్ఫూర్తితో నేను అనేక నాటకాలలో నటించగలిగాను. "బానిసోడా మేలుకో" అనే నాటికలో ప్రధాన పాత్ర పోషించి పరిషత్ పోటీలలో ఉత్తమ నటుడుగా అవార్డులు, రివార్డులు పొందగలిగాను.

**<u>కళావేదిక:</u>**

మన పాఠశాల ఆవరణలో వేదిక చాల ఎత్తుగా ఉండేది. ఈ కళా వేదికకు పెద్ద చరిత్ర ఉన్నది. ఈ వేదిక పై తొలి నాటక ప్రదర్శనగా "ఐదురోజులు" అనబడే సంస్కృత నాటిక కీర్తిశేషులు సంస్కృత ఉపాధ్యాయుడు కాండూరి వెంకటరమణ చార్యులు మరియు పాఠశాల ప్రధమ ఉపాధ్యాయుడు గౌరవనీయులు వెల్ది వెంకటేశ్వర్లు గార్ల దర్శక పర్యవేక్షణలో ప్రదర్శించటం జరిగినది. ఈ నాటికలో శిరిగిరి శింగయ్య గారు భీష్ముడుగా, నేను ద్రోణాచార్యులుగా మరియు దేవబత్తిన శింగమ్మ, దేవబత్తిన జయమ్మ, వేముల వెంకాయమ్మ నటించాము. ఈ వేదిక పై  పాఠశాల విద్యార్థులే కాక ఇతర పాఠశాల విద్యార్థులు, విద్యార్థుల తండ్రులు కూడా నాటకాలలో నటించుటకు ఆసక్తి చూపి నటించేవారు. నాటకాలకు గౌరవనీయులు శ్రీ నల్లూరి వెంకటేశ్వర్లు గారు, కీర్తిశేషులు సినీ దర్శకుడు T కృష్ణ గారు, RTC ఉద్యోగి రామారావు గారు దర్శక భాద్యతలను నిర్వర్తించారు.

కీ.శే. కృష్ణ గారి దర్శకత్వంలో ఈ వేదిక పై "సంభవామి యుగే యుగే" అనే నాటకం ప్రదర్శించ బడింది. ఈ నాటికలో పూర్వ విద్యార్థులు శిరిగిరి శింగయ్య మహా విష్ణువు గా, టి కృష్ణ నారదుడుగా, పోకిరి సుబ్బారావు  పాపారాయుడుగా, నేను భద్రయ్యగా (కామ్రేడ్) నటించి మెప్పించాము. పాఠశాల వార్షికోత్సవాల్లో భాగంగా పూర్వ విద్యార్థులమైన నేను, శిరిగిరి శింగయ్య, అన్వార్ భాష, శిరిగిరి వెంకట్రావు మున్నగువార్లు నటించిన "సమిధ" అనే నాటికను ఈ వేదికపై ప్రదర్శించడమైనది.

చివరగా పాఠశాల సంస్కృత ఉపాధ్యాయుడు శ్రీ రుక్మాంగద గారి ఆధ్వర్యంలో పాఠశాల పూర్వ విద్యార్థులు, పాఠశాల విద్యార్థులు మరియు విద్యార్థుల  తండ్రులతో సంయుక్తంగా

"కాల సర్పాలు" అనే నాటకాన్ని ఈ వేదిక పై ప్రదర్శించటం జరిగినది.  ఈ నాటికలో పాఠశాల విద్యార్థులు కొమ్మినేని పరమేశ్వర రావు, పొదిలి వెంకట్రావు, శిరిగిరి వెంకటేశ్వర్లు (ఎర్రబ్బాయి), సంస్కృత ఉపాధ్యాయుడు శ్రీ రుక్మాంగద గారు, నేను, విద్యార్థుల తండ్రులైన పాదర్తి శింగయ్య, పొదిలి నాగేశ్వరరావు గారు, నల్లమోతు రంగారావు గార్లు నటించారు. "నభూతో నభవిష్యత్" గా ప్రదర్శించడం జరిగినది. చుట్టూ ప్రక్కల గ్రామాల నుండి ప్రజలు తండోపతండాలుగా వచ్చి తిలకించటం జరిగినది. RTC ఉద్యోగి రామారావు దీనికి దర్శకత్వం వహించారు.  మరొక విశేషమేమంటే సినీ నటి, నేటి "టివి" నటి శివపార్వతి ఈ నాటకంలో హీరోయిన్ గా నటించి, ఈ వేదిక ద్వారానే తొలిసారిగా నాటక రంగానికి పరిచయమైనది.  గౌరవనీయులు శ్రీ నల్లూరి వెంకటేశ్వర్లు (అన్న) అన్నగా గుర్తింపు తెచ్చిన "అన్న చెల్లెలు" నాటకం ఈ వేదిక మీద ప్రదర్శించటం జరిగినది.

మన పాఠశాల కళావేదికకు ఇంత ప్రాశస్త్యం గురంచి చెప్పదలచి, పై ఉదహరించిన విషయాలు ప్రస్తావించాను.

**<u>ధన్యవాదములు:</u>**

మనపాఠశాల వజ్రోత్సవ వేడుకల సందర్భంగా విద్యాబోధన సేవలందించిన గురువులకు  గురుపూజోత్సవ కారక్రమం మరియు పూర్వ విద్యార్థుల నందరిని సమ్మేళన పరచి ఆనందానుభూతాలను పొందుటకు కృషిచేస్తున్న వజ్రోత్సవ కార్యక్రమ నిర్వాహకులు అందరికి పేరుపేరున ధన్యవాదములు తెలుపు చున్నాను.

ఇట్లు
కొమ్మినేని సత్యనారాయణ
పూర్వవిధ్యార్థి (1967 - 68 బ్యాచ్)
చేకూరపాడు